క్లుప్తంగా

మండలంలో 29.6 మి.మీ. వర్షం

దుగ్గిరాల: దుగ్గిరాల మండలంలో బుధవారం అర్ధరాత్రి విపరీతమైన ఈదురు గాలులు, మెరుపులు, ఉరుములతో కూడిన వర్షం కురిసింది. మండలంలో 29.6 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదయ్యిందని దుగ్గిరాల తాహసీల్దార్ కార్యాలయం అధికారులు వర్షమాపిని ద్వారా గురువారం వివరాలను వెల్లడించారు.

రిటైర్డ్ డీఎస్పీకి నివాళి



మంగళగిరి టౌన్: ఉన్నత విలువలతో కూడిన పోలీస్ అధికారిగా ఉద్యోగ ధర్మాన్ని అంకిత భావంతో విజయవంతం చేసి పేరు ప్రఖ్యాతలు గడించిన రిటైర్డ్ డీఎస్పీ బొప్పన విజయ్ కుమార్ సేవలు చిరస్మరణీయమని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు కొనియాడారు. పట్టణంలోని విజయ్‌కుమార్ నివాసంలో గురువారం నిర్వహించిన సంస్మరణ సభకు హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు చిన్ని తిరుపతయ్య, జాలాది జాన్‌బాబు, నందం బ్రహ్మేశ్వరరావు, కాబోతు ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ నిర్మూలనపై అవగాహన

మంగళగిరి: మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని ఉండవల్లి సెంటర్‌తో పాటు నులకపేట, డొల్లాస్ నగర్ ప్రాంతాలలో ఎయిడ్స్ నియంత్రణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో కళాజాతర బృందాలతో వీధి నాటికాలు, ప్రదర్శనల ద్వారా అవగాహన కలిపించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్ శాంత కుమారి, ఎల్‌టీ రాఘవేంద్ర, మారుతీ మహిళా సొసైటీ ప్రతినిధులు పి.గంగాభవాని, ఏఎన్ఎం ప్రత్యూష తదితరులు పాల్గొన్నారు.

వర్షం నీరు నిలబడకుండా చూడండి

మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న



తెనాలిఅర్బన్: వర్షపు నీరు నిలబడకుండా చూడాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న సూచించారు. చినరావూరు తోటలో గురువారం ఆయన పర్యటించారు. ఆప్రాంతంలోని మురుగు కాల్వలను బాగు చేయించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని అన్ని మురుగు కాల్వలు ప్రతిరోజు బాగు చేయించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఆయన వెంట పలువురు మున్సిపల్ అధికారులు ఉన్నారు.

మురుగు కాల్వలపై ఆక్రమణలు తొలగించండి

మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక



తెనాలిఅర్బన్: మురుగు కాల్వపై ఉన్న ఆక్రమణలు తొలగించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక ఆదేశించారు. పట్టణంలోని 8,10 వార్డులలో గురువారం జరుగుతున్న ప్రత్యేక పారిశుద్ధ్య నిర్వహణ పనులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మురుగు కాల్వలపై కొందరు రాళ్లు ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. దీనివల్ల కాల్వల పూడికతీత పనులకు ఇబ్బందులు కలుగుతున్నాయన్నారు. వెంటనే వాటిని తొలగించి ప్రతిరోజు వాటిని బాగు చేయాలని సూచించారు. ఆమె వెంట పలువురు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

ప్రయాణికులకు అదనపు సౌకర్యాలు కల్పించాలి

రేపల్లె: రైల్వే ప్రయాణికులకు అదనపు సౌకర్యాలు కల్పించాలని పట్టణాభివృద్ధి సంఘం కార్యదర్శి సి.వి.మోహన్‌రావు గురువారం ఒక ప్రకటనలో కోరారు. రేపల్లె- సికింద్రాబాద్ డెల్టా ఎక్స్‌ప్రెస్‌లో ఏసీ కోచ్‌లో సౌకర్యాలు మెరుగుపరచాలని కోరారు. ఏసీ కోచ్‌ల్లో అంతకుముందు ప్రయాణికులు వినియోగించిన దిండ్లు, దుప్పట్లను శుభ్రం చేయకుండా అలాగే ప్రయాణికులకు అందిస్తున్నారని ఆరోపించారు. వాటిని వినియోగించే ప్రయాణికులకు చర్మ వ్యాధులు సోకే ప్రమాదం ఉందన్నారు. ప్రయాణికుల రద్దీ దృష్ట్యా రేపల్లె గుంటూరుకు తెనాలి మీదుగా ప్రతి 2 గంటలకు ఒక రైలును నడిపేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. పల్నాడు, రాయగడ, తిరుపతి ఎక్స్‌ప్రెస్‌లను రేపల్లె నుంచి నడపాలని కోరారు. రేపల్లె రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని కోరారు.

విరుచుకుపడుతున్న ప్లాస్టిక్ భూతం

- అవగాహన లేక విచ్చలవిడిగా వినియోగం
- ఎక్కడ చూసినా ప్లాస్టిక్ వ్యర్థాలే
- ఇక్కట్లకు గురవుతున్న పారిశుద్ధ్య కార్మికులు



గుంటూరు ఛానల్ వెంట ప్లాస్టిక్ వ్యర్థాలు

తాడేపల్లి రూరల్: ఒక వైపు రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని చీపుర్లతో రోడ్లు శుభ్రం చేస్తున్నారు. మరో వైపు స్వచ్ఛ భారత్‌లో భాగంగా ప్లాస్టిక్ కవర్లు వినియోగించడం నిషేధమంటూ పలుచోట్ల దాడులు నిర్వహించి అపరాధ రుసుము విధించి, పత్రికా ప్రకటనలతో అవగాహన కల్పిస్తున్నారు. కానీ ప్లాస్టిక్ నియంత్రణ మాత్రం క్షేత్రస్థాయిలో నోచుకోవడం లేదు. అధికారుల ప్రయత్నాలన్నీ నామమాత్రంగానే సాగుతున్నాయని ప్రజలు విమర్శిస్తున్నారు. కొన్ని రోజుల తరువాత అవే షాపుల్లో నిషేధిత ప్లాస్టిక్ కవర్లు యథేచ్ఛగా అమ్ముతున్నారు. సామాన్య, మధ్య తరగతి ప్రజలే ఈ ప్లాస్టిక్ కవర్లు ఎక్కువగా వినియోగిస్తున్నట్లు కనిపిస్తోంది.

> ప్రభుత్వ నిబంధనల ప్రకారం 120 మైక్రాన్‌ల కంటే తక్కువ పరిమాణంలో ఉన్న ప్లాస్టిక్ కవర్లను వినియోగించకూడదని నిబంధనలు ఉన్నాయి. అయినప్పటికీ వ్యాపారులు వాటిని విక్రయిస్తూ, వినియోగిస్తూ పర్యావరణానికి హాని కలిగిస్తున్నారు. డ్వాక్రా సంఘాలు, ఇతర సంఘాల ద్వారా ఈ కవర్ల వినియోగంపై అవగాహన కల్పిస్తే కొంత ఉపయోగం ఉండవచ్చని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

డ్రైనేజీలో దర్శనమిస్తూ..

కూరగాయలకు వెళ్లినా, పాల ప్యాకెట్లను తెచ్చినా, దుకాణాలకు వెళ్లినా ప్లాస్టిక్ కవర్లను షాపు వారు ఇస్తుండడంతో వాటిలో సరుకులు వేసి ఇంటికి తెస్తుంటారు. తీసుకు వచ్చిన ఆ కవర్లలో ఆహార వ్యర్థాలు, చెత్తాచెదారం వేసి ఇంటి ముందున్న డ్రైనేజీల్లో లేదా చెత్త కుండీల్లో వేయడమో చేస్తున్నారు. చెత్త కుండీల్లో వేసిన కవర్లను శునకాలు, ఇతర జంతువులు తినేందుకు ప్రయత్నించి ఆ కవర్లు లాగుతుండడంతో రహదారులపై, గాలి, దుమ్ముతో డ్రైనేజీలోకి కవర్లు చేరుతున్నాయి. దీంతో పరిసర ప్రాంతాలు అపరిశుభ్రంగా తయారవుతున్నాయి. కొందరు నివాసదారులు ఆ ప్లాస్టిక్ కవర్లు ఏకంగా డ్రైనేజీల్లో వేస్తుండడంతో డ్రైనేజీలు మూసుకుపోయి ఆ మురుగు నీరు రోడ్డు మీదకు వచ్చి అపరిశుభ్రంగా తయారవుతోంది. ఫలితంగా పారిశుద్ధ్య కార్మికులకు అవస్థలు తప్పడంలేదు.

నామమాత్రపు తనిఖీలు..

స్వచ్ఛభారత్‌లో భాగంగా అధికారులు, ప్రజా ప్రతినిధులు, ఇతర స్వచ్ఛంద సంస్థల వారు 'ప్లాస్టిక్ నివారించండి-పర్యావరణాన్ని కాపాడండి' అంటూ ప్రచారం నిర్వహిస్తున్నారే తప్ప అసలు మూలాల గురించి పట్టించుకోవడం లేదు. అధికారుల కేసులు రాస్తున్న సమయంలో షాపు యజమానులు వాటిని అధికారులకు కనిపించకుండా దాచిపెట్టి తిరిగి అమ్ముతున్నారు. ప్లాస్టిక్ కవర్ల నిషేధం



వర్షం నీటిలో కొట్టుకొచ్చిన ప్లాస్టిక్ వ్యర్థాలు

పూర్తిగా చేస్తే అమ్మకానికి తీసుకురామంటూ షాపు యజమానులు అధికారులను ప్రశ్నిస్తున్నారు. అధికారులు సైతం తనిఖీలను నామమాత్రంగా చేస్తున్నారంటూ పలువురు వాపోతున్నారు. తనిఖీలకు సరైన సమయం లేకపోవడంతో అధికారులు చూసీ చూడనట్లు వదిలేస్తున్నారు.

ఖాతాదారుల నమ్మకంతోనే మన్ననలు



మాట్లాడుతున్న సత్యనారాయణ మూర్తి

మంగళగిరి: ఖాతాదారుల నమ్మకంతోనే బ్యాంక్ మన్ననలు పొందుతుందని బ్యాంక్ డైరెక్టర్ జేవీ సత్యనారాయణ మూర్తి అన్నారు. పట్టణంలోని పాత బస్టాండ్ సెంటర్‌లో గల 'ది విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్' ఆధ్వర్యంలో గురువారం అంజుమన్ షాదిఖానాలో సభ్యుల మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ.. 110 ఏళ్లుగా ఖాతాదారుల మన్ననలు పొందుతూ రెండు తెలుగు రాష్ట్రాల్లో అతి పెద్ద సహకార బ్యాంక్‌గా ప్రత్యేక స్థానం సంపాదించుకుందన్నారు. దేశ పురోగతిలో సహకార బ్యాంకులు కీలకపాత్ర పోషిస్తున్నాయని.. అటువంటి బ్యాంకులపై రిజర్వ్ బ్యాంక్ నిబంధనల పేరుతో ఆంక్షలు విధించడం సరికాదన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు పీవీ వెంకటరమణరావు, చిన్నం కోటేశ్వరరావు, నన్నపనేని అంజయ్య, జోనల్ మేనేజర్ ఎస్ఎస్ఆర్ మూర్తి, బ్రాంచ్ మేనేజర్ రవి శంకర్, కమిటీ సభ్యులు బత్తూరి మోహనరావు, వెంకటస్వామి, పిల్లలమర్రి నాగేశ్వరరావు, బత్తుల గిరి తదితరులు పాల్గొన్నారు.

మోదీ అధికారంలో దేశం తిరోగమనం



మాట్లాడుతున్న అజయ్‌కుమార్

ఆత్మకూరు(మంగళగిరి): నరేంద్ర మోదీ అధికారం చేపట్టాక దేశం తిరోగమనంలో నడుస్తుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జంగాల అజయ్‌కుమార్ విమర్శించారు. గురువారం నగర పరిధిలోని ఆత్మకూరులో సీపీఐ శాఖ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మోదీ విధానాలతో దేశం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిందన్నారు. రాష్ట్రంలో పరిశ్రమలు నెలకొల్పి నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ఎన్నికల హామీలను విస్మరించారని మండిపడ్డారు. కార్యక్రమంలో నాయకులు చిన్ని తిరుపతయ్య, కంచర్ల కాశయ్య, జలాది జాన్‌బాబు, మేడా హనుమంతరావు, పంతగాని మరియదాసు తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా శోభాయాత్ర

మంగళగిరి: తాడేపల్లి మండలంలోని గ్రామాల్లో హనుమాన్ శోభాయాత్ర వైభవంగా నిర్వహించారు. గురువారం హనుమజ్జయంతి సందర్భంగా మండలంలోని కుంచనపల్లి, కొలనుకొండ, వడ్డేశ్వరం, ఇప్పటం, పెదవడ్లపూడి, రేవేంద్రపాడు, మెల్లెంపూడి, గుండిమెడ, చిర్రావూరు, ప్రాతూరు, మణిపాల్ ఆసుపత్రి మీదుగా మహానాడు, సీతానగరం, ఉండవల్లి, పెనమాక, యర్రబాలెం, డొల్లాస్ నగర్, ప్రకాష్ నగర్, నులకపేటల మీదుగా తాడేపల్లి కొత్తూరిలోని ఆంజనేయస్వామి ఆలయం వరకు శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం ఆలయం వద్ద అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు టంకశాల ఈశ్వర్, రామిరెడ్డి, చెరుకూరి తిరుపతిరావు, వల్లూరి శివరామకృష్ణ, వైవీ సుబ్బారావు, జనసేన నాయకులు అంబటి తిరుపతిరావు, తిరుమలశెట్టి కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలకు తిలోదకాలు



తాడికొండలో నీటమునిగిన వెంచర్

తాడికొండ: రాజధాని ప్రాంతంలో రియల్ ఎస్టేట్ మాయాజాలం సాగుతుంది. కొనుగోలు దారులను ఆకర్షించి ప్లాట్లు అంటగడుతున్న రియల్ ఎస్టేటర్లు ప్రభుత్వ నిబంధనలకు తిలోదకాలు వదులుతున్నారు. బుధవారం నిండు వేసవిలో కురిసిన వర్షానికి తాడికొండ ప్రాంతంలో వేసిన రియల్ ఎస్టేట్ వెంచర్లు నీటమునికి చెరువులను తలపించాయి. నిబంధనల ప్రకారం ప్లాట్లు వేయాలంటే సీఆర్డీయే అనుమతి తీసుకోవడంతో పాటు పక్కా రోడ్లు, డ్రెయిన్‌లు, తాగునీటి ట్యాప్‌లు, విద్యుత్ సౌకర్యం కల్పించడంతో పాటు 10 శాతం భూమిని సంబంధిత గ్రామ పంచాయతీలకు రిజిస్ట్రేషన్ చేయాలి. కానీ ఇక్కడ మాత్రం యథా రాజా తథా ప్రజ అన్న చందంగా నిబంధనలను గాలికొదిలి యథేచ్ఛగా మోకాల లోతులో పంట పొలాల్లో అరకొర సౌకర్యాలు కల్పించి వెంచర్లు వేసి వాటిని అమ్మి భారీగా లబ్ధి పొందుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి నిబంధనులకు తూట్లు పొడిచి ప్రభుత్వ ధనాన్ని లూటీ చేస్తున్న అక్రమ వెంచర్‌లపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

నేడు 'హెల్త్ ఆన్ వీల్స్'తో ఉచిత వైద్యశిబిరం

వ్యాధినిర్ధారణ పరీక్షలు, క్యాన్సర్ స్క్రీనింగ్



డాక్టర్ డి.శారద

తెనాలి: వ్యాధి రహిత తెనాలి కోసం కృషిచేస్తున్న పట్టణానికి చెందిన డీ3 శారద సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక కొత్తపేటలోని తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో 'హెల్త్ ఆన్ వీల్స్'తో ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు జరిగే వైద్యశిబిరానికి వచ్చేవారు ఆహారం తిని, పాత రిపోర్టులతో సహా రావాలని సొసైటీ వ్యవస్థాపకురాలు డాక్టర్ డి.శారద ఒక ప్రకటనలో తెలియజేశారు. అన్ని రకాల వ్యాధినిర్ధారణ పరీక్షలు ఒకేచోట జరిగేలా 'హెల్త్ ఆన్ వీల్స్' వాహనంలో ఏర్పాటు చేశామని చెప్పారు. కిమ్స్-చక్ర క్యాన్సర్ సెంటర్ తక్కెళ్లపాడు అనుబంధంతో క్యాన్సర్ స్క్రీనింగ్ చేస్తున్నట్టు చెప్పారు. ఉచిత వైద్యశిబిరంలో బీపీ, షుగరు, థైరాయిడ్, శ్వాసకోశ వ్యాధులు, స్త్రీల వ్యాధులకు సలహాలతోపాటు గర్భాశయ ముఖద్వార క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్‌ను ముందుగా కనుగొనే స్క్రీనింగ్ పరీక్షలైన పాప్ స్మియర్, మమోగ్రామ్ పరీక్షలు, స్కానింగ్, ఎక్స్‌రే పరీక్షలు ఉచితంగా చేస్తామని తెలిపారు. అవసరమైనవారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఏపీజీఈఏ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు జయప్రదం చేయండి

పీజీఈఏ దుగ్గిరాల యూనిట్ అధ్యక్షుడు అందె బాలచంద్రమౌళిని, ప్రధాన కార్యదర్శి టి.మనోహర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న యూనిట్ అధ్యక్షులు అందె బాలచంద్రమౌళి

కొల్లిపర: విజయవాడలో 5న జరిగే రాష్ట్ర కౌన్సిల్ సమావేశాన్ని జయప్రదం చేయాలని ఏపీజీఈఏ దుగ్గిరాల యూనిట్ అధ్యక్షుడు అందె బాలచంద్రమౌళిని, ప్రధాన కార్యదర్శి టి.మనోహర్‌రెడ్డి కోరారు. గురువారం కొల్లిపరలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. జూన్ 5న విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జరుగనున్న ఏపీజీఈఏ రాష్ట్రకౌన్సిల్ సమావేశాన్ని ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి అందరూ హాజరు కావాలని కోరారు. జిల్లా ఐక్యవేదిక చైర్మన్ సయ్యద్ చాంద్‌బాషా ఆదేశాల ప్రకారం కొల్లిపర తహసీల్దార్, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, పంచాయతీ, రిజిస్ట్రేషన్ సిబ్బందితో కలసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాల్లో ఉద్యోగుల సమస్యలపై చర్చించి అనంతరం ఏపీజీఈఏ తరపున ప్రధాన నాయకులు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకువెళ్లి సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేయడం జరుగుతుందన్నారు. కావున ఈ సమావేశాలకు ఉద్యోగులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో దుగ్గిరాల యూనిట్ అధ్యక్షులు అందెబాల చంద్రమౌళి, ఉపాధ్యక్షుడు గుంటూరు పూర్ణప్రసాద్, ఉపాధ్యక్షులు షేక్ మీరావలి, జాయింట్ సెక్రెటరీ నూకవరపు శ్రీలక్ష్మి కుమారి, కార్యవర్గ సభ్యులు కొల్లిపర మండల తహసీల్దార్ గుమ్మడి సిద్ధార్థ, మండల అభివృద్ధి అధికారి వీరమాచనేని విజయలక్ష్మి సబ్ రిజిస్ట్రార్.ఎం.ఆదినారాయణరెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ రాజేష్, ఇఓపీఆర్డీ సి.హెచ్.భార్గవ్, పరిపాలనాధికారి ప్రతాపరెడ్డి, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ ర్ వంశీకృష్ణ సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరావు, ఎం .శ్రీలక్ష్మి కుమారి, ఫిజికల్ డైరెక్టర్స్ సూర్యప్రకాష్, దేవదాస్, వీఆర్వోలు భాస్కర్, సుష్మ, ప్రసాద్ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

యనమదలలో ఏకపక్షంగా టీడీపీ గ్రామకమిటీ ఎన్నిక

ప్రత్తిపాడు: యనమదలలో తెలుగుదేశం పార్టీ గ్రామ కమిటీ ఎన్నిక ఇష్టానుసారంగా, ఏకపక్షంగా నిర్వహించారని ఆ గ్రామంలోని కొందరు టీడీపీ నేతలు మండిపడ్డారు. ప్రత్తిపాడు మండలం యనమదల గ్రామంలో గురువారం టీడీపీ గ్రామ కమిటీ ఎన్నిక నిర్వహించారు. ఈ ఎన్నికకు పార్టీలో ఆది నుంచి క్రియాశీలకంగా ఉన్న వారు, ఆశావహులు రాకముందే ఎన్నికను ముగించారు. ఆశావహులు వెళ్లి ఎన్నిక ఎప్పుడని ప్రశ్నించడంతో, ఇప్పటికే ఎన్నిక ముగిసిందని, గ్రామ కమిటీని కూడా ప్రకటించామని మండల పార్టీ నాయకులు తెలిపారు. ఎన్నిక గురించి ముందస్తుగానే గ్రామంలోని పార్టీ శ్రేణులందరికీ సమాచారం ఇచ్చామని సదరు టీడీపీ నాయకులు తెలిపారు. దీంతో మరో వర్గం టీడీపీ నాయకులు, ఆశావహులు టీడీపీ మండల నాయకుల తీరుపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. అందరూ రాకముందే ఎన్నిక ఎలా నిర్వహిస్తారని ఘాటుగా ప్రశ్నించారు. ఒక పక్క చంద్రబాబు, లోకేష్ అందరినీ కలుపుకొని సమన్వయంతో ముందుకు సాగాలని సూచిస్తున్నప్పటికీ.. మండల పార్టీ అధ్యక్షుడికి, నాయకులకు అవేమీ పట్టడం లేదని, ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. గ్రామాల్లో ఏకపక్ష ఎన్నికల వర్గపోరుకు బీజాలు వేస్తున్నాయని టీడీపీ నాయకులు పాలేటి మాదవరావుతో పాటు యడ్లపల్లి బుల్లియ్య, బొంతు సాంబశివరావు, సూరగాని చంద్రమౌళి, వెంకట్రావు, ఆలా గోపి, బైనబోయిన లింగారావు, బైనబోయిన సీతారామయ్య, మన్నవ కోటయ్య, తోడేటి శివయ్య, కటారి శ్రీనివాసరావు, విగ్రహాల మంగయ్యలు ఆరోపించారు.

శ్రీరామ దూతం.. శిరసా నమామి!!

- వాడవాడలా హనుమజ్జయంతి వేడుకలు
- వాయుపుత్రుడికి విశేష పూజలు
- రామనామంలో మార్మోగిన అంజన్న ఆలయాలు



శ్రీ కృష్ణుడి అలంకారంలో మిద్దె సెంటర్ అంజన్న



నూతక్కిలో పూజల్లో పాల్గొన్న వేమారెడ్డి

మంగళగిరి, మంగళగిరి టౌన్: శ్రీరామ దూతం.. శిరసా నమామి అంటూ భక్తులు అంజన్న పాదాలకు నమస్కరించారు. గురువారం హనుమజ్జయంతిని పురస్కరించుకుని నగరంలోని పలు ఆలయాల్లో వాయుపుత్రుడికి విశేష పూజలు నిర్వహించారు. స్వామివారికి పంచామృతాభిషేకాలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులు ప్రణవిల్లారు. ఆలయాలకు పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు స్వామిని సేవించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆయా ఆలయాల వద్ద భక్తులకు అన్నప్రసాదం వితరణను నిర్వాహకులు చేశారు. పట్టణంలోని మిద్దె సెంటర్ ఆంజనేయస్వామిని అర్చకులు కృష్ణుడిగా అలంకరించారు. ఎర్రచెరువులోని పలు ఆలయాల్లో ప్రత్యేక అలంకరణలతో స్వామివారు దర్శనమిచ్చారు. నూతక్కి, రామచంద్రాపురం, నిడమర్రు, పెదవడ్లపూడి, చినవడ్లపూడి, యర్రబాలెం, నవులూరు, కృష్ణాయపాలెం, కురగల్లు, నిడమర్రు, కాజ, చినకాకాని, ఆత్మకూరులలో హనుమజ్జయంతి వేడుకలను వైభవంగా నిర్వహించారు. రామనామంతో ఆలయాలు మార్మోగాయి.

ప్రత్యేక పూజల్లో వేమారెడ్డి..

నగర పరిధిలోని నూతక్కి ఆంజనేయస్వామి ఆలయంలో స్వామివారిని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు, గ్రామ వైఎస్సార్ సీపీ నాయకులు వేమారెడ్డికి ఘన స్వాగతం పలికి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షులు నాలి వెంకటకృష్ణ, నాయకులు ఆరేకూటి కుర్మారెడ్డి, కొండమడుగుల గోపిరెడ్డి, అన్నపురెడ్డి మహేశ్వరరెడ్డి, అన్నపురెడ్డి శివరామిరెడ్డి, కళ్లం రామిరెడ్డి, చీడిపూడి సురేష్‌రెడ్డి, తమ్మా సుబ్బారెడ్డి, నూతక్కి రామచంద్రరావు, అన్నపురెడ్డి తరుణ్‌రెడ్డి, పేర్ల వెంకటేష్, కందూరు శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దుగ్గిరాల: హనుమజ్జయంతి వేడుకలు మండలంలోని గ్రామాల్లో వైభవంగా జరిగాయి. దుగ్గిరాల, ఈమని, పెదకొండూరు, తుమ్మపూడి, మంచికలపూడి, చుక్కపల్లివారిపాలెం గ్రామాల్లో జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు, హనుమాన్ చాలీసా పఠనం చేశారు. మంచికలపూడిలో అన్నసంతర్పణను నిర్వహించారు.



113తాళ్లూరులో ప్రసన్నాంజనేయుడు



ఫిరంగిపురంలో దక్షిణముఖంలో మారుతి

ఫిరంగిపురం: మండలంలోని పలు గ్రామాల్లోని ఆంజనేయస్వామి ఆలయాల్లో హనుమజ్జయంతి సందర్భంగా విశేష పూజలు, అర్చనలను అర్చకులు గురువారం ఘనంగా నిర్వహించారు. ఫిరంగిపురంలోని దక్షిణముఖం ఆంజనేయస్వామికి అర్చకులు నారాయణం ప్రసాదాచార్యులు, వంశీకృష్ణలు నాగవల్లీ దళాలతో పూజలు చేశారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. కండ్రికలోని అభయాంజనేయ స్వామికి అర్చకులు రాంబాబు విశేష అర్చనలు, అష్టోత్తర, సహస్రనామ పూజలు నిర్వహించారు. వేములూరిపాడులోని దాసాంజనేయ స్వామికి అర్చకులు పూజలు చేశారు. వేమవరం అడ్డరోడ్డులోని అభయాంజనేయుడికి నాగవల్లీ దళార్చనలు నిర్వహించారు. వేమవరంలోని ప్రసన్నాంజనేయస్వామికి విశేష అలంకారం చేసి వేడుకలు నిర్వహించారు.

నేడు పున్నమ్మ చెరువు అక్రమాలపై విచారణ

తాడికొండ: తాడికొండ గ్రామ పంచాయతీ కార్యాలయంలో పున్నమ్మ చెరువు అక్రమాలపపై శుక్రవారం విచారణ నిర్వహించనున్నట్లు సీపీఐ తాడికొండ నియోజకవర్గ కార్యదర్శి ముప్పాళ్ల శివ శంకరరావు ఒక ప్రకటనలో తెలిపారు. తాడికొండ అడ్డరోడ్డులో పున్నమ్మ చెరువు 8 ఎకరాల విస్తీర్ణంలో ఉంటే కొందరు ప్రబుద్ధులు కాజేశారన్నారు. దీనిపై ఏప్రిల్ 14న పొన్నెకల్లు గ్రామానికి విచ్చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు సీపీఐ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశామన్నారు. ఇటీవల జేసీ భార్గవ్ తేజ చెరువును పరిశీలించి విచారణ హాజరుకు ఆదేశించిన నేపథ్యంలో అన్ని రాజకీయ పార్టీలు హాజరు కావాలని ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

విజయకీలాద్రిపై విశేష పూజలు



విజయకీలాద్రిపై స్వామివారు

మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని సీతానగరం కొండ విజయకీలాద్రిపై హనుమజ్జయంతిని ఘనంగా నిర్వహించారు. గురువారం జయంతి సందర్భంగా ఆంజనేయస్వామికి పంచామృతాభిషేకం, సకల కార్యసిద్ధి, వడమాల సేవ, తమలపాకులతో అర్చన, మంగళశాసనం, తీర్థప్రసాద గోష్టి వైభవంగా నిర్వహించారు. కార్యక్రమాలలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని రామనామాలతో స్వామి ముందు ప్రణవిల్లారు.

– మంగళగిరి

జీవవైవిధ్యంతో జన జీవన భద్రత



కాకుమాను: భూమిపై మానవ మనుగడ సక్రమంగా సాగాలంటే జీవవైవిధ్యం బాగుండాలని.. దాని ద్వారానే జన జీవన భద్రత, సుస్థిర అభివృద్ధి సాధ్యమని ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ గేరా మోహనరావు అన్నారు. అంతర్జాతీయ జీవ వైవిధ్యం దినోత్సవం సందర్భంగా పెదనందిపాడు శాఖా గ్రంథాలయంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మానవాళి సహా ప్రకృతిలోని జీవరాశులన్నీ జీవవైవిధ్యం పరిధిలోకి వస్తాయని అన్నారు. ప్రకృతి సమతుల్యతతో పాటు ఆహార భద్రత, పేదరిక నిర్మూలన, సుస్థిర జీవనోపాధులు వంటివి జీవ వైవిధ్యంతో ముడిపడి ఉన్నాయని తెలిపారు. ప్రకృతిని కాపాడుకోవాల్సిన భాద్యత మనందరిపై ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ నిర్వాహకురాలు పి.సుభాషిణి, గారపాటి రమేష్, శివయ్య, ప్రసాదరావు, వీరాస్వామి, రవి, తదితరులు పాల్గొన్నారు.